

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఐసిడిఎస్ పీడీ సుజాత రాణి

పాలకోడేరు : ఇటీవల కాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగాయని ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఐసిడిఎస్ పీడీ బి.సుజాత రాణి అన్నారు. విస్సా కోడేరు ఐసిడిఎస్ సెక్టార్ పరిధిలోని శృంగవృక్షంలో కిశోరి వికాసంలో భాగంగా సైబర్ నేరాలు - ఆన్‌లైన్ భద్రతపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు, విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా పీడీ సుజాత రాణి మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు ఫోన్ నెంబర్, చిరునమా, వ్యక్తిగత వివరాలు వంటివి చెప్పకుండా ఉండాలన్నారు. ముఖ్యంగా ఇటువంటి వివరాలను ఆన్‌లైన్‌లో షేర్ చేయకూడదని చెప్పారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. 1930 నెంబర్‌కు ఫోన్ చేసి సైబర్ నేరాలకు సంబంధించి ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. సిడిపిఒ వి.వాణి విజయరత్నం, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

కరోనా కలవరం..!

ఏలూరులో ఇద్దరికి కరోనా పాజిటివ్

విజయవాడలోని ప్రయివేటు ఆసుపత్రిలో ఆరోగ్య టెస్టులు చేయగా నిర్ధారణ

కుటుంబ సభ్యులకు టెస్టులు చేయగా నెగిటివ్ వచ్చినట్లు సమాచారం

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో పది బెడ్లతో ప్రత్యేక వార్డు

విఆర్‌డిఎల్ ల్యాబ్, ఆక్సిజన్ సిలిండర్లు ఏర్పాటు

'పశ్చిమ'లో తణుకు ప్రయివేటు ఆసుపత్రిలో కరోనా కేసు అంటూ ప్రచారం

ఖండించిన జిల్లా వైద్యశాఖ అధికారి గీతాబాయ్



ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా ప్రజానీకాన్ని కరోనా కలవర పెడుతోంది. రెండు జిల్లాల్లో మంగళవారం కరోనా కేసులు నమోదుపై పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. దీంతో రెండు జిల్లాల ప్రజానీకం ఒక్కసారిగా ఉలిక్కిపడిన పరిస్థితి నెలకొంది. 2020లో వచ్చిన కరోనా పరిస్థితులను మరోసారి గుర్తుతెచ్చుకుని ఆందోళన చెందుతున్న పరిస్థితి నెలకొంది. కరోనా కేసుల నమోదుపై జరుగుతున్న ప్రచారాన్ని రెండు జిల్లాల వైద్యశాఖ అధికారులు ఖండించారు. ఏలూరులోని శాంతినగర్‌కు చెందిన భార్యా, భర్తలకు విజయవాడ ప్రయివేటు ఆసుపత్రిలో కరోనా నిర్ధారణ అయినట్లు తెలియడంతో ఏలూరు నగర ప్రజలు ఒక్కసారిగా కలవరపాటుకు గురయ్యారు. దీనిపై ఆరోగ్యశాఖ అధికారులు మాట్లాడుతూ ఐదు రోజుల క్రితం ఆరోగ్య టెస్టుల కోసం విజయవాడ ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లిన భార్యా భర్తలకు కరోనా లక్షణాలు కనిపించడంతో చికిత్స తీసుకుంటున్నారని, వారి ఆరోగ్యం బాగానే ఉందని తెలిపారు. వెంటనే శాంతినగర్‌లో ఆ కుటుంబం ఇంటికి వైద్యశాఖ సిబ్బందిని పంపించడం సైతం జరిగిందని అక్కడ ఎవరూలేరని అధికారులు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లిన వ్యక్తికి కరోనా అంటూ ప్రచారం సాగింది. దీనిపై ఆ జిల్లా వైద్యశాఖ ఆరోగ్యశాఖ అధికారులు స్పందిస్తూ జ్వరం తదితర లక్షణాలు ఉన్నాయని ఏలూరులోగానీ, విజయవాడులోగానీ పరీక్ష చేయించుకోవాలని ఆసుపత్రి వైద్యులు సూచించడం మాత్రమే జరిగిందని, కరోనా కేసులు ఏమీ నమోదు కాలేదని తెలిపారు. ఆ ఆసుపత్రిలో కరోనా టెస్టులకు సంబంధించి ఎటువంటి పరికరాలు లేవని తెలిపారు. దీంతో జనం ఊపిరిపీల్చుకున్నారు. దేశవ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతున్నట్లు అధికారిక ప్రకటనలు చెబుతున్నాయి. దీంతో మరోసారి జనంలో కరోనా ఆందోళన నెలకొంది. ఇప్పటికే జనం మాస్క్ వేసుకోవడం, జాగ్రత్తలు తీసుకోవడం వంటివి ప్రారంభించారు. కరోనా కేసుల నమోదుపై జరుగుతున్న ప్రచారం జనాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ప్రత్యేక ఏర్పాట్లు..

దేశ వ్యాప్తంగా కరోనా కేసులు నమోదవుతున్నట్లు తేలడంతో జిల్లా అధికారులు ముందుగానే అప్రమత్తమయ్యారు. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఇప్పటికే పది బెడ్లతో ప్రత్యేక వార్డు సైతం ఏర్పాటు చేశారు. అవసరాన్ని బట్టి మరిన్ని చర్యలు తీసుకునే విధంగా చర్యలు చేపడుతున్నారు. కరోనా అనుమానితులకు టెస్టులు నిర్వహించేందుకు విఆర్‌డిఎల్ ల్యాబ్‌తోపాటు, ఆక్సిజన్ సిలిండర్లు సైతం ఏర్పాటు చేసినట్లు సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.సావిత్రి తెలిపారు. మంగళవారం జ్వరం, జలుబుతో ఉన్న ఒక మహిళలకు కరోనా టెస్ట్ చేయడం జరిగిందని, నెగిటివ్ వచ్చిందని సూపరింటెండెంట్ తెలిపారు. ఇప్పటి వరకూ కరోనా కేసులు ఏవీ ఆసుపత్రిలో నమోదు కాలేదన్నారు. పశ్చిమలోనూ ముందుగానే కరోనాకు సంబంధించిన ఏర్పాట్లు చేసిన పరిస్థితి నెలకొంది.

అవగాహన చర్యలపై దృష్టి పెట్టాల్సిందే..

దేశ వ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు దానిపై మరోసారి అవగాహన కల్పించాల్సి ఉంది. మాస్క్ ధరించడం, చేతుల కడుక్కోవడం, శానిటైజేషన్ పాటించడం, ఆహార నియమాలపై మరోసారి ప్రజలకు అవగాహన కల్పిస్తే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కరోనా కేసులపై జిల్లా అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాల్సి ఉంది.

కరోనా కేసులు లేవు

గీతాబాయ్, డిఎంఅండ్ హెచ్ఒ, పశ్చిమగోదావరి జిల్లా

జిల్లాలో ఎటువంటి కరోనా కేసులూ నమోదు కాలేదు. తణుకులోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లిన వ్యక్తికి జ్వరం, జలుబు ఉండడంతో పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించడం మాత్రమే జరిగింది. సదరు ఆసుపత్రిలో కరోనా నిర్ధారణకు సంబంధించిన ఎటువంటి ల్యాబ్‌లూ లేవు. సదరు వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్నాం. ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

సరదాగా స్నానానికి వెళ్లి..!

ముగ్గురు నాగులంక విద్యార్థులు గల్లంతు - ముమ్మరంగా గాలింపు చర్యలు

ప్రజాశక్తి - ఆచంట

వశిష్ట గోదావరిలో సరదాగా స్నానం చేద్దామని దిగారు. అంతవరకూ ఆటలాడుతూ గడిపిన స్నేహితులు ప్రమాదవశాత్తూ గల్లంతయ్యారు.. ఇంట్లో చెప్పకుండా వచ్చేశారని, ఇటువంటి వార్త వింటామని అనుకోలేదని మృతుల తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు.. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కమినిలంకలో ఎనిమిది మంది మృతి చెందిన ఘటన మరువకముందే వశిష్ట గోదావరిలో మంగళవారం సాయంత్రం ముగ్గురు విద్యార్థులు గల్లంతవ్వడం ఆందోళనకు గురి చేస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి.

గల్లంతైన విద్యార్థులు







తూర్పుగోదావరి జిల్లా గన్నవరం మండలం నాగులంకకు, పెదలంకకు చెందిన ఐదుగురు విద్యార్థులు పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం అయోధ్యలంక పంచాయతీ పరిధి రావిలంక వశిష్ట గోదావరిలో సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో గోదావరిలో స్నానాలు చేయడానికి వచ్చారు. వీరిలో నాగులంకకు చెందిన కేతా ప్రవీణ్ (15), నాగులంకకు చెందిన సానబోయిన సూర్య తేజ (12), పెదలంకకు చెందిన నీతు పూడి పాల్‌కుమార్ (12) గోదావరిలో స్నానానికి దిగారు. మరో ఇద్దరు విద్యార్థులు గట్టుపైనే ఉన్నారు. అయితే ముగ్గురు విద్యార్థులు గల్లంతవ్వడంతో గట్టుపైన ఉన్న ఇద్దరు విద్యార్థులు భయపడి పారిపోయినట్లు స్థానికులు తెలిపారు.

బంధువుల రోదనలు..

విషయం తెలుసుకున్న బంధువులు ఘటనా స్థలానికి వచ్చి తమ పిల్లల జాడ తెలియకపోవడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇంటి దగ్గర కూడా చెప్పకుండా వచ్చేశారని కేతా ప్రసాద్ తండ్రి వెంకటేశ్వరరావు, సానబోయిన సూర్య తండ్రి ఏడుకొండలు కన్నీటి పర్యంతమయ్యారు.

ముమ్మరంగా గాలింపు..

గోదావరిలో ముగ్గురు విద్యార్థులు గల్లంతయ్యారని తెలిసిన వెంటనే తహశీల్దార్ జి.కనకరాజు, ఎస్ఐ కె.వెంకటరమణ, విఆర్ఒ శేషు ఘటనా స్థలానికి సిబ్బందితో సహా చేరుకున్నారు. గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినా రాత్రి కావడంతో గల్లంతైన విద్యార్థుల ఆచూకీ లభించలేదు. సంఘటనా స్థలానికి జిల్లా ఎస్‌పి నయీమ్ అస్మి, డిఎస్‌పి శ్రీ వేద, పెనుగొండ సిఐ రాయుడు విజయ్ కుమార్, పెనుగొండ, పెనుమంట్ర, ఆచంట ఎస్ఐలు చేరుకుని పర్యవేక్షించారు.

బెల్ట్ షాపులకు ప్రభుత్వం అండ

వరదలా పారుతున్న యానాం అక్రమ మద్యం

బెల్ట్ షాపులు తొలగించకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం

కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి



కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

బెల్ట్ షాపులు పెడితే బెల్ట్ తీస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు బెల్ట్ షాపులకు ప్రభుత్వం అండగా నిలవడం దుర్మార్గమని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి విమర్శించారు. యానాం నుంచి అక్రమంగా మద్యం ఏరులై పారుతున్నా, విచ్చలవిడిగా అమ్మకాలు సాగుతున్నా ఎక్సైజ్ శాఖ పట్టీపట్టినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. భీమవరం జిల్లా సిఐటియు కార్యాలయంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నరసింహమూర్తి మాట్లాడారు. కల్లుగీత, కల్లు అమ్మకాలపై చిన్నచూపు చూడడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. మద్యం సిండికేట్లు, ప్రభుత్వ పెద్దలు, ఎక్సైజ్ శాఖ అధికారులు మీకింత, మాకింత అనే పద్ధతిలో రాత్రీ, పగలు తేడా లేకుండా బహిరంగంగా మద్యాన్ని అమ్మేస్తున్నారని విమర్శించారు. బెల్ట్ షాపులు తొలగించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. బెల్టు షాపులపై కొరడా ఝులిపించాలని ఎక్సైజ్ ఉన్నతాధికారుల సమీక్షా సమావేశంలో ఎక్సైజ్ మంత్రి ఆదేశాలిచ్చారని వారి ఆదేశాల వెనుక ఆంతర్యం ఏంటో అర్థం కాని పరిస్థితి అన్నారు. ఇలాంటి ప్రకటనలతో ప్రజలను ఎంతకాలం నమ్మిస్తారన్నారు. ప్రభుత్వ పరోక్ష ఆదేశాల వల్లే జిల్లాలో 5 వేల వరకూ రాష్ట్రంలో 75 వేల వరకూ ఉన్న బెల్టు షాపుల వల్ల ప్రకృతి సిద్ధమైన, ప్రజల ఆరోగ్యానికి ఎన్నో విధాలుగా ఉపయోగపడే తాటికల్లు అమ్మకాలు లేక గీత కార్మిక కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయన్నారు. కొన్ని ప్రాంతాల్లో సిండికేట్లు ఎక్సైజ్ సిఐలను డామినేట్ చేస్తున్నారని, వారు చెప్పినట్లు సిఐలు చేయడం సిగ్గుచేటు అన్నారు. నరసాపురం ప్రాంతంలో బెల్టు షాపులకు వేలం వేస్తే ఎక్సైజ్ శాఖ చోద్యం చూడడం సిగ్గుచేటన్నారు. ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో బెల్టు షాపులు వేలం వేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. బెల్ట్ షాపులు తొలగించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి మాట్లాడుతూ తాగడానికి నీళ్ల లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయని, మద్యం దొరకని గ్రామం ఒక్కటైనా ఎక్సైజ్ శాఖ చూపించగలదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి గీత కార్మిక కుటుంబాల పట్ల చిత్తశుద్ధి ఉంటే తక్షణం బెల్ట్ షాపులు తొలగించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసి ఆ కుటుంబాలను ఆదుకోవాలన్నారు. అనుభవజ్ఞులు తయారు చేసిన ఎక్సైజ్ పాలసీ యథావిధిగా అమలు చేయాలన్నారు. వృత్తిలో మరణించిన, వికలాంగులైన వారికి తెలంగాణాలో ఇస్తున్నట్లుగా రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని, గీత కార్మికులపై దాడులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.చంటి, జిల్లా ఉపాధ్యక్షులు కడలి పాండు, సూరిబాబు, కాగిత రాధాకృష్ణ, చింతపల్లి చిన్న వీరాస్వామి పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు అనుమతులు మంజూరు చేయాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

పరిశ్రమల స్థాపనకు నిర్ణీత గడువులోగా అనుమతులు మంజూరు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 13 రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జెసి అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లా స్థాయి నుంచి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు పారిశ్రామిక పెట్టుబడులు, యూనిట్ల స్థాపనపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగు పెట్టాలనుకున్న వారికి ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించేలా బ్యాంకర్లతో సమన్వయం చేయడం జరుగుతుందన్నారు. రైసు మిల్లులు, ఆక్వా, క్వాయర్ సెక్టారుకు సంబంధించి నూతన ఉత్పత్తులు, నూతన ఆలోచనలు, ఎగుమతుల అవకాశాలు చర్చించేందుకు త్వరలో ఒక వర్కుషాపు నిర్వహించాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావుకు సూచించారు. అసంఘటిత రంగ కార్మికులు అందరినీ పిఎంజెజెబివై, పిఎం ఎస్‌బిఐ బీమా పథకం కింద నమోదు చేసేందుకు సంబంధిత అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ మన మిత్ర యాప్ 9552300009 ద్వారా పరిశ్రమలకు సంబంధించి 13 సేవలు అందుబాటులో ఉన్నాయని, సంబంధిత సమాచారాన్ని హోర్డింగ్స్, బ్యానర్స్ ద్వారా విస్తృత ప్రచారం చేయాలని అధికారులకు ఆదేశించారు. గత నెల 19వ తేదీ నుండి ఇప్పటివరకూ వివిధ శాఖల అనుమతుల కోసం 209 దరఖాస్తులు రాగా 199 దరఖాస్తులను ఆమోదించడం జరిగిందని, మరో 9 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందని తెలిపారు. సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ప్రోత్సాహం ఎంఎస్‌ఎంఇ వివిధ రాయితీ పాలసీ కింద 49 యూనిట్లకు రూ.85 లక్షలు మంజూరుకు అనుమతించడం జరిగిందన్నారు. పిఎంఇజిపి కింద యూనిట్ల స్థాపనకు 568 దరఖాస్తులను బ్యాంకులకు పంపగా 342 యూనిట్లు మంజూరయ్యాయని 317 స్థాపించడం జరిగిందని, మిగతావి కూడా త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కెఎస్ఎన్.ప్రసాద్, జిల్లా కార్మిక శాఖ అధికారి ఆకన లక్ష్మి పాల్గొన్నారు.

రోగులకు సంపూర్ణ వైద్యం అందించాలి

ఏరియా ఆసుపత్రిని కార్పొరేట్ ఆసుపత్రిగా తీర్చిదిద్దడమే ధ్యేయం

రాష్ట్ర విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వైద్యుల నుంచి నర్సుల వరకు అంతా సేవాభావంతో పనిచేసినప్పుడే రోగులకు సంపూర్ణ వైద్యం అందించగలమని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ, ఏరియా ఆసుపత్రి సలహా మండలి ఛైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి అభివృద్ధి సలహా మండలి నూతన కమిటీతో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ తాతారావు అధ్యక్షతన ఆయన మంగళవారం ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలో వైద్యులంతా అందుబాటులో ఉన్న గైనకాలజిస్ట్, రేడియాలజిస్ట్ లేకపోవడం వల్ల రోగులు ఇబ్బంది పడుతున్నారని, త్వరగా వారిని నియమించే ఏర్పాటు చేయాలని డిసిహెచ్ఎస్.సూర్యనారాయణకు సూచించారు. డాక్టర్లు ఎంత బాగా వైద్యం అందించినా మందులు పనిచేయకపోతే ఆ ఎఫెక్ట్ ఆసుపత్రి పని తీరుపై పడుతుందని, పనిచేయని మందులను నిశేధించి ఉన్నతాధికారులకు తెలియజేస్తే ఆ మందులు బ్యాన్ చేయించే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. ఏరియా ఆసుపత్రి పక్కన నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి నూతన భవనాలు ఆగస్టు లోపు పూర్తి చేయాలని, పూర్తి చేయకపోతే కాంట్రాక్టర్‌పై శాఖపరంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రానున్న రోజుల్లో ఏరియా ఆసుపత్రిని క్రమక్రమంగా కార్పొరేట్ ఆసుపత్రిలా తయారు చేయడమే తన లక్ష్యమన్నారు. ముందుగా సలహా కమిటీతో ఆసుపత్రికి కావలసిన మందులు ల్యాబ్ ఎక్విప్మెంట్, ఏరియా ఆసుపత్రిలో ప్రమాదకరంగా ఉన్న మూడు స్తంభాల ఏర్పాటు, లైట్లు, ఫ్యాన్లు కొనుగోలుపై అభివృద్ధి కమిటీ ఆమోదంతో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులు బడుగు పెద్ద, అనుములు శ్రీనివాస్, కట్టిముక్కల గణేష్, పెంట రాజేశ్వరి, వైద్యులు డాక్టర్ చిట్యాల సురేంద్ర నూతన అభివృద్ధి కమిటీ సలహాకు కట్టుబడి ఉంటామని ప్రమాణం చేశారు.



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎంఎల్ఎ బొలిశెట్టి

ఉపాధి హామీ చట్టం కూలీలకు వరం



మాట్లాడుతున్న చిన వీరభద్రరదావు

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఉపాధి హామీ చట్టం కూలీలకు వరం అని, కూలీలు ఈ చట్టాన్ని కాపాడుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు, కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పర్యటనలో భాగంగా అత్తిలి మండలం కంచుమర్రు, ఈడూరు గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారితో కొద్దిసేపు మాట్లాడి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. వారితో వీరభద్రరావు, గోపాలన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కూలీల వలసలు అరికట్టి ఉన్న ఊరిలోనే పని కల్పించడం, లేకుంటే తిండి పెట్టండి పనైనా చూపండి అనే నినాదంతో దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం, వామపక్షాలు చేసిన పోరాటాల ఫలితంగా 2005లో కేంద్రంలో కమ్యూనిస్టుల మద్దతుతో అధికారంలోకి వచ్చిన యుపిఎ -1 ప్రభుత్వం పాలనలో ఉపాధి హామీ చట్టం పురుడుపోసుకుందన్నారు. కూలీలకు ఒక వరంలా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వర్యం చేయాలని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఈ కుట్రలను నిరంతరం వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాల ద్వారా తిప్పికొడుతూ ఉపాధి హామీ పరిరక్షణకు పోరాటం చేస్తున్నాయన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం చేస్తున్న పోరాటాలకు కూలీలందరూ అండగా నిలిచి చట్టాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దొంగ నాగ శ్రీనివాసరావు, షేక్ రహీమ్, సరేళ్ల కనకరాజు, బికం రాజబాబు, నేలపాటి ప్రసన్న కుమారి, నేలపాటి లీల భరణి, వేలు పూరి వెంకట నాగ కుమారి, నంద్యాల దుర్గాభవాని, స్వామి పాల్గొన్నారు.

మూగజీవుల కోసం 200 నీటి తొట్టెల ఏర్పాటు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గోవులను రక్షించడం, ప్రేమించడం మానవుని నైతిక బాధ్యత అని భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం నాచువారి సెంటర్‌లో గోసంరక్షణ ఆధ్వర్యంలో మంగళవారం 200 నీటి తొట్టెలను ఉచితంగా ఎంఎల్ఎ అంజిబాబు అందించారు. రోడ్లమీద తిరిగే మూగజీవులకు నీటి తొట్టెల పంపిణీ చేయడం అభినందనీయమని ఎంఎల్ఎ అంజిబాబు అన్నారు. హిందూ సనాతన ధర్మంలో గోవులకు ప్రత్యేక స్థానం ఉందని, గోవులతోపాటు మూగజీవాలకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విశేషమని, ప్రజలు తమ వంతుగా ఈ తొట్టెలలో నీటి నిల్వలు చేయాలని పిలుపునిచ్చారు. సుంకర దాసు మాట్లాడుతూ పట్టణంలో జంతు ప్రేమికులకు ఈ తొట్టెలను అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.గోవిందబాబు, కాగిత వెంకటరమణ, జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల చంద్రశేఖర్, వబిలిశెట్టి రామకృష్ణ, కారుమూరి సత్యనారాయణ మూర్తి, చెరుకువాడ రంగసాయి, అల్లు శ్రీనివాస్, నల్లం చిట్టిబాబు, కొప్పినిడి శ్రీనివాస్, మెంటే అమ్ములు పాల్గొన్నారు.

'యోగాంధ్రా'ని విజయవంతం చేయాలి : జెసి, ఎంఎల్ఎ

ప్రజాశక్తి - నరసాపురం

వశిష్ట గోదావరిలో పడవులు, వలందర రేవు వద్ద మంగళవారం యోగాభ్యాసంలో పాల్గొని ప్రభుత్వ విప్, స్థానిక ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంయుక్తంగా అందరితో కలిసి యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, స్థానిక ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమాన్ని ఎన్‌డియే ప్రభుత్వం ఛాలెంజిగా తీసుకుందని అందుకు అనుగుణంగా విజయవంతం చేయుటకు ప్రతిఒక్కరూ ముందుకు అడుగులు వేయాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపుతో యోగాంధ్ర కార్యక్రమాలు కన్నుల పండుగగా జరుగుతున్నాయన్నారు. కరోనా వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని, ఎంతో మంది వీధిన పడ్డారని అన్నారు. యోగా కార్యక్రమాల వల్ల మానవునికి చక్కని ఆరోగ్యం, దేహదారుఢ్యంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ టూరిజం ప్రాంతాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు చేసుకుంటే అంతర్జాతీయ గుర్తింపు, స్ఫూర్తి కలుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు జిల్లాలో కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతున్నాయన్నారు. వశిష్ఠగోదావరి సాగర తీరంలో యోగాభ్యాసన కార్యక్రమం జరుపుట ముఖ్య ఉద్దేశం వశిష్ఠ గోదావరి అందాలను, ప్రకృతి సౌందర్యాలను చూపించడం ఆ ఫొటోస్, వీడియోలు, కవరేజీ ప్రధాని మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వరకు చేరాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఆర్‌డిఒ దాసిరాజు, డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద, ట్రెయినీ డిఎస్‌పి కె.మానస, జిల్లా టూరిజం అధికారి ఎవి.అప్పారావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, ఆయుష్ జిల్లా అధికారి డాక్టర్ ఎ.హరి శ్రీనివాసు, కో-ఆర్డినేటరు డాక్టర్ ఎ.శ్రీరామ్, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.కీర్తి కిరణ్, మున్సిపల్ కమిషనర్ బి.అంజయ్య, తహశీల్దార్ అయితం సత్యనారాయణ పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న జెసి, ఎంఎల్ఎ, తదితరులు


'ఏటా 96 వేల మంది పిల్లల అపహరణ'



మాట్లాడుతున్న న్యాయవాది ఫణికర్

ప్రజాశక్తి - నరసాపురం

అంతర్జాతీయ తప్పిపోయిన బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గ్రేడ్-1 జిల్లా గ్రంథాలయంలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లీగల్ సర్వీసెస్ సభ్యులు వైడి.ఫణికర్ పాల్గొని మాట్లాడుతూ 1983లో ప్రారంభమైన ఈ ప్రత్యేక దినాన్ని ప్రతి సంవత్సరం మే 25న జరుపుకోవడం పరిపాటి అన్నారు. ప్రతి సంవత్సరం దాదాపు 96 వేల పిల్లలు అపహరణకు గురవుతున్నారని, అందుకే పిల్లలను రక్షించడానికి రక్షణ చట్టంపై తల్లిదండ్రులకు, పిల్లలకు అవగాహన కల్పించాలని ఉన్నత న్యాయస్థానాలు ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. చిన్న పిల్లలు ఎక్కువగా అపహరణకు గురై ఇతర దేశాలకు సరఫరా చేసి వారిని వివిధ అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారు. తల్లిదండ్రులకు చెప్పకుండా ఒంటరిగా ఎక్కడకు వెళ్లకూడదని, తెలియని వారితో పరిచయం, తిండి పదార్థాలు తీసుకోవడం చేయకూడదన్నారు. ప్రస్తుతం పిల్లలు ఎక్కువగా సోషల్ మీడియాకు ప్రభావితులై తల్లిదండ్రులకు చెప్పకుండా పారిపోతున్నారని, చిన్నతనం నుంచి పిల్లలు మంచి, చెడు, పెద్దలను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. ఒంటరిగా ఎవరైనా పిల్లలు అనుమానాస్పదంగా కనిపిస్తే 1098కి కాల్ చేస్తే శిశుగృహ డిపార్ట్మెంట్ వారికి తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం అధికారి కెజెఎస్ఎల్.కుమారి, సెక్రటరీ ఎం.శేఖర్ బాబు, ఇతర ప్రముఖులు, ప్యానెల్ లాయర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పేరుపాలెం నార్త్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న పొదలు

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్..!

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం నార్త్ పంచాయతీ పరిధి పార్వతీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు పొదలు అల్లుకొని ప్రమాదకరంగా మారింది. దీంతో వర్షం కురిసిన సమయాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి పొదలను తొలగించాలని కోరుతున్నారు.

శరవేగంగా భూ రీసర్వే

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని మహదేవపట్నం గ్రామంలో నిర్వహిస్తున్న భూ రీ సర్వే శరవేగంగా సాగుతుందని మహదేవపట్నం గ్రామ రెవెన్యూ అధికారి సైలాడ చిన్నారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత ఎల్‌పిఎం నెంబర్ ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నామని, రైతులందరూ దీనికి సహకరించాలని, అందుబాటులో లేని రైతులకు జాయింట్ ఎల్‌పిఎం నెంబర్ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. రీ సర్వే ప్రారంభించిన 22 రోజుల్లోనే సుమారు 75 శాతం సర్వే పూర్తయిందని ఆయన తెలిపారు. గ్రామంలో సర్వే జరిగే భూ రైతులకు ముందుగానే సమాచారం ఇవ్వడం జరుగుతుందని, వారందరూ సకాలంలో పత్రాలను అందుబాటులో ఉంచుకొని తమకు సహకరించాలని ఆయన కోరారు. ఈ రీసర్వే కార్యక్రమంలో మండల సర్వేయర్ రత్నావళి, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లోకి.. నూతన కార్యదర్శులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని పలు గ్రామ పంచాయతీలకు ప్రమోషన్ మీద వచ్చిన నూతన గ్రామ కార్యదర్శులు మంగళవారం సాయంత్రం విధుల్లో చేరినట్లు ఎంపిడిఒ ప్రభాకరరావు తెలిపారు. ఈమేరకు సత్యవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-4 వి.వాణి చంద్రమణి గ్రేడ్-3 ప్రమోషన్‌తో సత్యవరం గ్రామ పంచాయతీలో జాయిన్ అయ్యారని, మార్టేరు గ్రామ పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన పి.వెంకట హర గోపాల్ గ్రేడ్-3 ప్రమోషన్‌తో వెలగలేరు గ్రామ పంచాయతీలో జాయిన్ అయ్యారని ఆయన తెలిపారు. మార్టేరు గ్రామ పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన జి.కావ్యశ్రీ పెనుగొండ మండలం రామన్న పాలెం గ్రామ పంచాయతీ గ్రేడ్-3 ప్రమోషన్‌తో వెళ్లారని, పెనుమంట్ర గ్రామ పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన బి.ప్రగతికుమార్ గ్రామ పంచాయతీ గ్రేడ్-3 ప్రమోషన్‌తో ఎస్ఐ.పఱ్ఱు గ్రామ పంచాయతీలో జాయిన్ అయ్యారని, పెనుగొండ మండలం వెంకట్రామపురం జి-4 కార్యదర్శి కర్రి మోహన్ జి-3 కార్యదర్శి ప్రమోషన్‌పై నత్తా రామేశ్వరం పంచాయతీలో జాయిన్ అయ్యారని ఆయన తెలిపారు.

వెంకటాపురంలో భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు గ్రామం వెంకటాపురం ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈమేరకు ఉదయం నుంచి స్వామివారికి విశేష పూజలు జరిగాయి. అనంతరం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఉన్నారు. అన్న సమారాధన నిమిత్తం దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ దాట్ల వెంకట రామరాజు ముందుకు వచ్చి 20 కేజీల పులిహోర, ఎనిమిది వందల లీటర్ల ఆర్వో వాటర్‌ను అందజేశారు.

రాజ్యాంగం అమల్లో ఉందా? రెడ్ బుక్ అమల్లో ఉందా?

కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - గణపవరం

రాష్ట్రంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అమల్లో ఉందా లేక రెడ్ బుక్ అమలు జరుగుతుందా అని కెవిపిఎస్ జిల్లా సహాయకార్యదర్శి చిన్నంచిన నాగేశ్వరరావు విమర్శించారు. మంగళవారం గణపవరంలో ఒక ప్రకటన విడుదల చేశారు. తెనాలి పట్టణంలో ముగ్గురు దళిత మైనారిటీ యువకులపై పోలీసులు చర్యని ప్రపంచానికి థర్డ్ డిగ్రీని ఉంచించారు. నడి రోడ్డుపై పట్టపగలు ప్రజలందరూ చూస్తూ ఉండగా యువకుల అరికాళ్లపై పోలీసులు లాఠీలతో కొట్టడం అత్యంత హేయమైన చర్యని అన్నారు. రాష్ట్రంలో పోలీస్ యంత్రాంగం రెడ్ బుక్ అమలు చేస్తున్నారని అన్నారు. తెనాలి ఘటనను నిరసిస్తూ బాధ్యులైన పోలీసులపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. దళిత మైనారిటీ యువకులపై లాఠీలతో కొట్టిన పోలీసులపై ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి భారత రాజ్యాంగంపై చిత్తశుద్ధి ఉంటే తక్షణమే చట్టాన్ని అతిక్రమించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని, వెంటనే విధుల నుంచి తొలగించాలని కోరారు. రాజ్యాంగంలోని 311 ఆర్టికల్ ప్రకారం ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.



ఎన్‌టిఆర్ అవార్డు అందుకుంటున్న హరికృష్ణ, బాలకృష్ణ

హరిబాబు, హరికృష్ణకు అభినందన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణ కళాకారులు, రంగస్థల నటులు, సామాజిక స్వచ్ఛంద సేవా తత్పరులు గురజా హరిబాబును, సింగర్, స్టేజ్ ఆర్టిస్ట్, మ్యూజిషియన్ పద్మనాభ హరికృష్ణను ఎన్‌టి.రామారావు జయంతి సందర్భంగా ఈనెల 25వ తేదీన హైదరాబాద్ కూకట్ పల్లిలో సూర్యచంద్ర కల్చరల్, సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సంస్థ ద్వారా ఎన్‌టిఆర్ అవార్డులు ప్రదానం చేశారు. వీరికి ఎన్‌టిఆర్ ఎక్సలెన్సీ అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు పల్లె మోహన్‌దాస్, కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస రావు, ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ విజయలక్ష్మి, సీనియర్ ఐఎఎస్ అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం, డైరెక్టర్ ఆకుమర్తి బాబూరావు, మెగా 9 ఛానల్ బెంచకాయ షార్ట్ ఫిల్మ్ యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. అవార్డులు పొందిన హరిబాబు, హరికృష్ణలను పాలకొల్లు నటీనట సంక్షేమ సంఘం, సమాఖ్య కళాకారులు, పాలకొల్లు కళాపరిషత్, రసమయి, సంస్కార భారతి సభ్యులు, వివిధ కళారంగ కళాకారులు, కళాభిమానులు అభినందించారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పురపాలక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 29న గురువారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాలులో నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తెలిపారు. ఈమేరకు ఆమె మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశానికి సకాలంలో కౌన్సిల్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

నేడు చదరంగం పోటీలు

ప్రజాశక్తి - నరసాపురం

8వ నూలి సాయి అభయ్ మెమోరియల్ ఏపి స్టేట్ అండర్-19 ఓపెన్ అండ్ గర్ల్స్ చదరంగం పోటీలు స్థానిక హైవే ఇన్ ఏసి హాల్‌లో ఈనెల 28 ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని వాసవి క్లబ్ ప్రెసిడెంట్, అభయ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, పిజిబిఎస్ మహిళ కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ తెలిపారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, పలువురు రాజకీయ నాయకులు, అధికారులు పాల్గొంటారన్నారు. ప్రతి సంవత్సరం తన కుమారుడు పేరిట రూ.64 వేల నగదు బహుమతితో నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఎనిమిదవ సంవత్సరమని అన్నారు. మొత్తం ఈ పోటీలకు అన్ని జిల్లాల నుంచి సుమారు 400 మంది చిన్నారులు పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు 9440867370 నెంబరుకు సంప్రదించగలరని తెలిపారు.

రక్షిత తాగునీటి పథకాల్లో కానరాని క్లోరినేషన్

ప్రజారోగ్యంతో చెలగాటం
క్లోరినేషన్ చేపట్టాలని ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - కాళ్ల

గ్రామాల్లోని ఒహెచ్ఎస్ఆర్ ట్యాంకులు తరచూ శుభ్రం చేయకపోవడంతో తాగునీరు కలుషితం అవుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే పలు గ్రామాల్లో వ్యాధులు పంజా విసురుతున్న తరుణంలో వైద్యాధికారులు సురక్షితమైన నీటిని తాగాలని సూచిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు కూడా గ్రామాల్లో తాగునీటి వనరుల వద్ద క్లోరినేషన్ పనులు చేపట్టాలని మండల అధికారులకు ఆదేశించిన విషయం విధితమే. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో క్షేత్రస్థాయిలో క్లోరినేషన్ పనులు అటకెక్కాయి. దీంతో కలుషిత నీటిని తాగుతుండడంతో వ్యాధుల ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.



బొండాడ పేటలో ఒహెచ్ఎస్ఆర్ ట్యాంక్

గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల శుభ్రతను అధికారులు గాలికి వదిలేశారు. ఎక్కడా క్లోరినేషన్ చేపడుతున్న ఆనవాళ్లు కనిపించడం లేదు. ట్యాంకుల నిర్వహణకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా ఆ దిశగా ఎక్కడా చర్యలు చేపట్టడం లేదు. దీంతో ప్రజలు కలుషిత నీటిని తాగి వ్యాధుల బారిన పడుతున్నారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో 35 మంచినీటి చెరువులు ఉన్నాయి. 63 ఫిల్టర్ బెడ్లు ఉన్నాయి. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ద్వారా 26 రక్షిత మంచినీటి పథకాలున్నాయి. సమగ్ర రక్షిత మంచినీటి పథకం ఒకటి బొండాడ గ్రామంలో ఉంది.

ట్యాంకుల నిర్వహణ అంతంత మాత్రమే..

తాగునీటి ట్యాంకుల నిర్వహణ బాధ్యతను పంచాయతీలు నిర్వహించాలి. ఇందులో భాగంగా ట్యాంకుల పనితీరు పర్యవేక్షిస్తూ నీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూడాల్సి ఉంది. ప్రస్తుతం గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. ప్రతినెలా ట్యాంకును శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో నీటిలో పురుగులు, మలినాలు ఉంటున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యాధులు ప్రబలే అవకాశం..


రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ లేకపోవడం ప్రజారోగ్యానికి ముప్పుగా పరిగణించబడుతుంది. క్లోరినేషన్ అనేది నీటిలోని బ్యాక్టీరియా, వైరస్, ఇతర సూక్ష్మజీవులను తొలగించి నీటిని శుభ్రపరచడానికి ఉపయోగించే ఒక ప్రక్రియ. రక్షిత పథకాల ద్వారా సరఫరా చేయబడే నీటిలో క్లోరినేషన్ లేకపోవడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురికావచ్చు. కొన్నిసార్లు నీటిలో క్లోరినేషన్ లేకపోవడం వల్ల తాగునీటి ద్వారా వ్యాధులు సంక్రమించే ప్రమాదం కూడా ఉంది.

15 రోజులకొకసారి ట్యాంకులు శుభ్రం చేయాలి..

గ్రామాల్లో 15 రోజులకొకసారి తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయడంతోపాటు, ట్యాంకులు శుభ్రం చేయాల్సి ఉంది. కానీ క్షేత్రస్థాయిలో పంచాయతీ సిబ్బంది చోద్యం చూస్తున్నారు. పంచాయతీల్లో నిధుల కొరత, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వెరసి ఒహెచ్ఎస్ఆర్ ట్యాంకులు శుభ్రం చేయకపోవడంతో కలుషిత నీరు తాగాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. అన్ని రక్షిత పథకాలను నెలలో రెండుసార్లు శుభ్రం చేసి ట్యాంకు నిండినప్పుడల్లా క్లోరినేషన్ చేయాలి. గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు, వనరుల వద్ద క్లోరినేషన్ పనులు ఎలా జరుగుతున్నాయని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గ్రామాల్లోని తాగునీటి వనరుల వద్ద అపరిశుభ్రత నెలకొంది. దీంతో కలుషిత నీటిని ప్రజలు తాగాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. ట్యాంకుల నిర్వహణ, క్లోరినేషన్ కోసం ప్రభుత్వం ఏటా నిధులు మంజూరు చేస్తుంది. ఈ నిధులు ఖర్చు చేస్తున్నట్లు లెక్కలు చెబుతున్నారే తప్ప ఎక్కడా ట్యాంకులు శుభ్రం చేసిన పరిస్థితులు లేవు. వాస్తవంగా ఓవర్‌హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఓసారి శుభ్రం చేసి క్లోరినేషన్ చేపట్టాల్సి ఉంది. ఈ విధంగా నెలకు 2 సార్లు, ఏడాదికి 24 సార్లు చేయాలి. పంచాయతీ అధికారులు, పాలకులు ఆ ఊసే మరచిపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

శుభ్రం చేస్తున్నాం..

ఎ.ఫణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ, కాళ్ల



రక్షిత పథకాలున్న అన్ని గ్రామాల్లో ట్యాంకులను శుభ్రం చేయాలని పంచాయతీ కార్యదర్శులందరికీ స్పష్టమైన ఆదేశాలిచ్చాం. అపరిశుభ్రంగా ఉన్న ట్యాంకులను గుర్తించి అక్కడ సమస్యలు లేకుండా చూస్తాం. ప్రతినెలా పర్యవేక్షిస్తున్నాం. పరిశీలించి పకడ్బందీగా చర్యలు తీసుకుంటాం. క్లోరినేషన్ పంచాయతీ అధికారులదే పూర్తి బాధ్యత.




నరసాపురం: మాట్లాడుతున్న సంస్థ కార్యదర్శి శేఖర్ బాబు

ఉత్సాహభరితంగా.. వేసవి విజ్ఞాన తరగతులు

ప్రజాశక్తి - నరసాపురం

ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్ బాబు సందర్శించి పిల్లలు నేర్చుకుంటున్న విషయాలు ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. పిల్లలు చాలా ఉత్సాహంగా, సంతోషంగా నేర్చుకుంటున్న విషయాలు చెప్పారు. సమ్మర్ క్యాంపులో సహకరిస్తున్న రిసోర్స్ పర్సన్స్‌ను, ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను హాజరైన విద్యార్థులను, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ, రీడర్స్ ఫోరం వారిని లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారిని అభినందించారు. పుస్తకాలు ఎక్కువగా చదవాలని పుస్తక పఠనం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, జికె విషయాలు ఎక్కువగా తెలుసుకోవాలని, 'చినిగిన చొక్కా అయిన తొడుక్కో కానీ మంచి పుస్తకం కొనుక్కోవాలి' అని కందుకూరి వీరేశలింగం పంతులు మాటలు గుర్తుచేశారు. పుస్తక పఠనం, కథలు చెప్పడం, వినిపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తోట సురేష్, బొమ్మిడి కృష్ణమూర్తి, సూర్య కుమారి, కృష్ణవేణి, అరుణ, సూర్యకుమారి, డాక్టర్ అమ్మాజీ, సుధీర్ మోహన్, విజయ్ కుమార్, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను గ్రేడ్‌వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి పర్యవేక్షించారు.

తాడేపల్లిగూడెం : విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథాలయానికి రావడం అలవాటు చేసుకుంటే విద్యార్థుల భవిష్యత్తు బాగుంటుందని, గ్రంథాలయంలో పుస్తకాలను చదవడం వల్ల గొప్ప విజ్ఞానవంతులై భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలను సాధించగలుగుతారని గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. రిసోర్స్‌పర్సన్ ప్రత్తి వీరాస్వామి విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తకాలు చదివించడం, ఆటలు ఆడటం, అట్టముక్కలతో బొమ్మలు తయారుచేయడం నేర్పించారు. కొప్పెల్ల శ్రీనివాసరావు జింక, ఎలుక, కాకి నటనలతో విద్యార్థులకు నీతి కథలు వివరించారు. సత్య ప్రకాశరావు విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్ బోధించారు. గరికపాటి బాపయ్యశర్మ విద్యార్థులకు స్వామి వివేకానంద జీవిత చరిత్ర వివరించారు. గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ తాడేపల్లిగూడెం పట్టణంలో ఉన్న తల్లిదండ్రులు వారి పిల్లలను గ్రంథాలయానికి పంపించడం అలవాటు చేయాలన్నారు. జీవితంలో ఉన్నత స్థానానికి వెళడానికి గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ వేసవి శిక్షణ తరగతులను పట్టణంలో ఉన్న విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.




తాడేపల్లిగూడెం : తయారు చేసిన బొమ్మలతో విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని అపురూపంగా జరుపుకున్నారు. పది కాదు.. ఇరవై కాదు.. 25 ఏళ్ల జ్ఞాపకాల్లో మైమరిచి పోయారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, ప్రసిద్ధ చిత్రకారుడు బాపు, యర్రాప్రగడ సుబ్బారావు లాంటి ఎంతోమంది మహనీయులు చదివిన నరసాపురం టేలర్ ఉన్నత పాఠశాల రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందింది. ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన పదో తరగతి 1999 - 2000 బ్యాచ్ విద్యార్థులు 25 ఏళ్ల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సమ్మేళనానికి రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, బెంగుళూరు రాష్ట్రాల నలుమూల ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఒకేసారి కలుసుకున్నారు. టేలర్ పాఠశాల కార్యదర్శి పోతుల జగన్మోహన్, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు ఆర్‌వి సుబ్రహ్మణ్యంలు ముఖ్య అతిథులుగా విచ్చేసిన సభకు సంస్కృతం మాస్టారు కడిమిళ్ల వరప్రసాద్ అధ్యక్షత వహించారు. వారితో పాటు తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులు టి.కృష్ణవేణి, దమయంతి, శ్రీదేవి, మీనాక్షి, మురళీ ధవేజీ, రత్నాజీ, రామాంజనేయులు, గంగారావు, సిబ్బంది రమణ, భాస్కరరావు, ప్రస్తుత సిబ్బంది లక్ష్మీకుమారి, సత్యవేణి, లోకేష్ సత్కరించారు. ఈ సందర్భంగా పోతుల జగన్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానంలో గౌరవాన్ని పొందినప్పుడే ఉపాధ్యాయులకు పూర్తి గుర్తింపు లభిస్తుందని, విద్యార్థుల ఉన్నతిని తెలుపుతుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. గురువులు చూపించిన సన్మార్గంలో నడిచిన ప్రతి విద్యార్థీ ప్రస్తుతం వివిధ వృత్తుల్లో, ఉద్యోగాల్లో కొనసాగుతూ ఆనంద జీవితాన్ని గడపడం సంతోష కరమని అన్నారు. పిల్లల కోసం ఆట పరికరాలు, మ్యాజిక్ షో ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థినులు మ్యూజికల్ చైర్ పోటీలు, లక్కీ డ్రాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పిల్లలతో పాటు పూర్వ విద్యార్థులు నృత్యాలు చేస్తూ అందరినీ అలరించారు.



1999-2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

సైబర్ నేరాలపై పలుచోట్ల అవగాహన



పెనుమంట్రలో..

ప్రజాశక్తి - పెనుమంట్ర

కిశోరి బాలికలు ఆన్‌లైన్, సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి, జాగ్రత్తగా ఉండాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎస్.వెంకట లక్ష్మి అన్నారు. మంగళవారం కిశోరి వికాసం వేసవికాల శిక్షణా కార్యక్రమంలో భాగంగా పొలమూరు, ఓడూరు, నత్తా రామేశ్వరం గ్రామాల్లో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత గురించి బాలికలకు ప్రాజెక్ట్ తరుపున అవగాహన కల్పించారు. పిల్లలు ఫోను ఎక్కువగా ఉపయోగించరాదని, చదువుకు అవసరమైన సమాచారంకు మాత్రమే వినియోగించుకోవాలని, తెలియని వ్యక్తులతో చాటింగ్ చేయరాదని చిరునామా, ఫోన్ నెంబరు, పాఠశాల అడ్రస్, ఇంటి అడ్రస్ వంటి వ్యక్తిగత వివరాలు అపరిచితులతో షేర్ చేసుకోరాదని అన్నారు. తెలియని వ్యక్తులతో సంభాషణలో పాల్గొనకూడదని, ఫోనులో బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన పాస్‌వర్డు షేర్ చేయరాదని, వ్యక్తిగత సమాచారం షేర్ చేయడం వల్ల ఇబ్బందులు పడవలసి వస్తుందని అన్నారు. సోషల్ మీడియాలో గోప్యతను పాటించాలని, వ్యక్తిగత సమాచారాన్ని పబ్లిక్‌గా షేర్ చేయడం వల్ల దుర్వినియోగం అవుతుందన్నారు. దానివల్ల ప్రమాదాలకు గురికావచ్చని హెచ్చరించారు. సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయడానికి 1930 నంబర్‌కు కాల్ చేయాలని అవగాహన కల్పించారు. ఒటిపిలను ఎవరికి షేర్ చేయరాదని, పాస్‌వర్డ్‌ను బహిర్గతం చేయరాదని సూచించడంతో పాటు, ఆన్‌లైన్‌లో అసభ్య పదజాలం, ఇతరులను కించపరిచే పోస్టులు చేయడం వల్ల దీర్ఘకాలిక పరిణామాలు ఉంటాయని, అన్ని పరస్పర చర్యలు గౌరవంగా, మర్యాదగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్‌లు వెంకటలక్ష్మి, టి.పోసమ్మ, పి.వరలక్ష్మి, ఎంకె.ఎస్లు, ఎఎన్ఎంలు, ఆశ, అంగన్వాడీ సహాయకులు పాల్గొన్నారు.

గణపవరం: కిషోర బాలికలు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని అంగన్వాడీ పిప్పర సెక్టార్ సూపర్‌వైజర్ సిహెచ్.దుర్గాభవాని అన్నారు. మంగళవారం కిషోర్ వికాసం కార్యక్రమంలో భాగంగా పిప్పర అంగన్వాడీ సెంటర్‌లో కిషోర్ బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళ సంరక్షణ కార్యదర్శి పుష్ప సురేఖ, ఆశావర్కర్ మారమ్మ, ఎండి ఆశా పాల్గొన్నారు.

పెనుగొండ : కిషోర్ వికాస్ సమ్మర్ క్లాసులలో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత, చిరునామా ఫోన్ ఆధారంగా వ్యక్తిగత వివరాలు, అపరిచితుల పరిచయాలు పలు అంశాలపై అవగాహన సదస్సు కల్పించారు. మంగళవారం మల్లప్ప దిబ్బ అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సుజాత, సిడిపిఒ కృష్ణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ ప్రతి ఒక్కరిపై గౌరవంగా, ప్రతిష్ట దెబ్బతినకుండా నడుచుకోవాలని, సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయడానికి నెంబర్ 1930 ఫోన్ చేయాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ఎం.లలిత, సిబ్బంది పాల్గొన్నారు.



గణపవరంలో..

యోగా జీవన విధానంలో భాగం కావాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

యోగ మన జీవన విధానంలో ఒక భాగం కావాలని తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పెద్ద తాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో యోగ మాసోత్సవాల కార్యక్రమాన్ని ఎంపిడిఒ ఎం.విశ్వనాథ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ యోగా మాసోత్సవాల్లో భాగంగా మే 21 నుంచి జూన్ 21 వరకు నిర్వహించే మాసోత్సవాల్లో ప్రజలు, విద్యార్థులు, యువత, ఉద్యోగులు, వ్యాపారులు అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఈ సందర్భంగా యోగా గురువులు, వాసవి ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు గ్రంధి సత్యనారాయణ, పతాంజలి యోగ ధ్యాన మందిర నిర్వాహకులు విద్యార్థులతో ప్రోటోకాల్ యోగాసనాలు చేయించారు. అనంతరం యోగ గోల్డ్ మెడలిస్ట్ మాధవరావు గురూజీ ప్రత్యేక ఆసనాలు వేసి విద్యార్థులకు స్ఫూర్తినింపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్, ఎంపిడిఒ ఎం.విశ్వనాధులతో పాటు యోగ గురువులను వాసవి కళాశాల యాజమాన్యం సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాసవి కళాశాల ప్రిన్సిపల్ రత్నాకర్ రావు, ఎలక్ట్రికల్ ఎఇ రామకృష్ణ, వాసవి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమంట్ర: యోగా చేయడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం కలుగుతుందని విశ్రాంత ఉపాధ్యాయిని పడాల సువర్ణ గౌరి అన్నారు. మంగళవారం మార్టేరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా 29వ రోజు కార్యక్రమంలో గ్రంథాలయంలో పిల్లల చేత యోగా చేయించారు. అనంతరం పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీష్, ఇంగ్లీష్ స్టోరీస్‌చే గ్రంథాలయ మాస్టర్ పిటి శివకుమార్ చెప్పారు. వేసవి విజ్ఞాన శిబిరంలో ఎస్.సభాష్ రెడ్డి, పి.నాగశ్రీరామిరెడ్డి, ఎస్.జశ్వంతి, ఎస్.తనుష, కె.గంగా కార్తికేయ, టి.హర్ష, బి.హర్ష, వి.శివ, కె.అనిల్ కూమార్, జి.ప్రదీప్ పాల్గొన్నారు.

యోగాంధ్ర కార్యక్రమంలో అధికారులు



తాడేపల్లిగూడెంలో..

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని యోగాంధ్ర మండల స్థాయి శిక్షణా కార్యక్రమంలో భాగంగా పెనుమంట్ర జిల్లా పరిషత్ హై స్కూల్, మార్టేరు ఎస్‌విజి జెడ్‌పి హై స్కూల్ పరిధిలోని గ్రామాలకు చెందిన 180 మంది విలేజ్ స్థాయి ట్రెయినర్లకు మండల స్థాయి యోగా ట్రెయినర్లకు ఫిజికల్ డైరెక్టర్‌చే శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెనుమంట్ర హైస్కూల్ హెచ్ఎం, గ్రామ సర్పంచి టి.ప్రియాంక, గ్రామ ఉప సర్పంచి, బివి.శ్రీనివాస రాజు, గ్రామ ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు, నాయకులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు. మార్టేరు హై స్కూల్‌లో జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి, గ్రామ సర్పంచి మట్టా కుమారీరాము, ఉప సర్పంచి కర్రి వేణుబాబు, ఎంపిడిఒ ప్రభాకర్ రావు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

కాళ్ల : మండలంలోని ఉద్యోగులకు కాళ్ల మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం యోగపై శిక్షణ ఇచ్చారు. జూన్ 21న యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. దానిలో భాగంగా మండల పరిషత్ ఉద్యోగులకు, మండలంలోని పంచాయితీ కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు యోగపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణలో ఎంపిడిఒ జి.స్వాతి, పంచాయితీ కార్యదర్శులు, విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది, మహిళ పోలీసులు పాల్గొన్నారు.



పడవపై పనలను చేరవేస్తున్న రైతులు

నేటికీ ముంపులోనే వరిచేలు

పడవపై పనలను చేరవేస్తున్న రైతన్నలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని రామన్నపాలెం పంచాయతీ అడుగుపర ప్రాంతంలో సుమారు 100 ఎకరాలలో వరిచేలలో నేటికీ ముంపు నీరు బయటికి వెళ్లలేదు. దీంతో అన్నదాతలు వరిని ఒబ్బిడి చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెరువులా మారిన చేల నుంచి వరి పనలను తీసుకొచ్చేందుకు పడవలపై వేసి చేరవేస్తున్నారు. దీంతో మాసూలు వ్యయం రెట్టింపు అవుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పూడికతీత పనులను పరిశీలిస్తున్న నాయకులు

కాలువలో పూడిక తొలగింపు


ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూసేందుకు కాలువలలోని పూడిక తొలగింపు పనులు చేపట్టామని మొగల్తూరు నీటి సంఘం అధ్యక్షుడు కడలి వీర మోహన్ రావు అన్నారు. మంగళవారం పంట కాలువ పూడిక తీత పనులను నీటి సంఘం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మోహన్ రావు మాట్లాడారు. దీంతో సాగు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉంటాయని ఆయన అన్నారు. ఆయన వెంట నీటి సంఘం ఉపాధ్యక్షుడు ముక్కు పుల్లయ్య నాయుడు, నాయకులు దేశంశెట్టి శ్రీను ఉన్నారు.

మహానాడుకు తరలిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - మొగల్తూరు

కడపలో నిర్వహిస్తున్న టిడిపి మహానాడుకు మండలంలోని గ్రామాల నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున మంగళవారం తరలివెళ్లారు. టిడిపి మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. మాజీ ఎంపిపి కత్తిమండ ముత్యాలరావు, బొల్లా చంటి, పాల రాంబాబు, పలువురు నాయకులు ఉన్నారు.



అన్నదానం ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ

ఆంజనేయస్వామి సన్నిధిలో అన్న సమారాధన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం సుంకర పద్దయ్య వీధిలోని 25 అడుగుల శ్రీఅభయ ఆంజనేయస్వామి దేవస్థానంలో మహా నివేదన, అన్న సమారాధనను రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) ప్రారంభించారు. శ్రీహనుమజ్జయంతి వేడుకల ముగింపు సందర్భంగా మంగళవారం అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఎంఎల్‌ఎ అంజిబాబు స్వామివారిని దర్శించుకుని అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేలాది మంది భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ముచ్చకర్ల శివ, లంకి చిన్ని, ముచ్చకర్ల సుబ్బారావు, వబిలిశెట్టి రామకృష్ణ, గనిరెడ్డి త్రినాథ్, కారుమూరి సత్యనారాయణ మూర్తి, భూషణం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా వికసిత కృషి సంకల్ప అభియాన్

ప్రజాశక్తి - ఉండి

దేశవ్యాప్తంగా సుమారు కోటి 50 లక్షల మంది రైతులను 2 వేల మంది శాస్త్రవేత్తల బృందాలు ముఖాముఖి కలుసుకునేందుకు వికసిత కృషి సంకల్ప అభియాన్ ఉపయోగపడుతుందని ఉండి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు కృషి విజ్ఞాన కేంద్రాల్లో ఈనెల 29వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు రైతుల సమస్యలు తెలుసుకునేందుకు పంట చీడ పీడలను నివారించేందుకు కావలసిన మార్గాలను సూచించేందుకు వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులందరూ పాల్గొని యాత్రలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.